# దొంగా... దొంగా...

**నిష్టల రామలింగస్వామి**

“అబ్బబ్బా! ఊరుకోండి కాసేపు. అసలు ట్రూత్ ఏమిటో కనుక్కోవాలి. ఈ సంగతి ఎవరికీ తెలీదు. ఈ దొంగతనం ఎలా జరిగిందో అర్థం అవడంలేదు. ఎందుకంటే ఇంట్లో అందరూ వున్నారు. ఏ శబ్దం లేదు. అన్ని తలుపులూ వేసే వున్నాయి. ఏ పక్కనుంచీ వచ్చిన ఆనవాలు తెలిసిపోతుంది. అయితే జరిగిన దొంగతనం ఎలా జరిగింది? అంతా అతి విచిత్రంగానే వుంది. ఎవరు దీనికి కారకులు?''

లక్ష్మీపతి ఆపసోపాలు పడిపోతూ ఇంట్లోకి వచ్చాడు. అతన్ని చూసిన ఇంట్లో వాళ్ళు గాభరాపడిపోయారు. లక్ష్మీపతి తొందరగా వెళ్ళి బీరువా తెరిచాడు. లాకర్ చూస్తే పెట్టిన నూరు రూపాయల కట్ట కాదు వేయి నూరు రూపాయల కట్ట మాయమైంది. అంటే లక్షరూపాయలు మాయం. దొంగతనం అయిపోయింది. లబోదిబోమంటు న్నాడు లక్ష్మీపతి. ఎలా పోయిందో తెలియటంలేదు. నిన్నటి నుంచీ ఇదే గోల! ఒకటా, రెండ, లక్ష!

“నాన్నగారూ నిన్న రాత్రి ఎక్కడినుంచి వస్తున్నారు. అలసిపోతూ, వెంటనే బీరువాలో లాకర్ తెరచి చూసి డబ్బు పోయిందన్నారు. ఇది ముందే మీకు తెలుసా. లేక ఎవరైనా తీస్తే చూసి వెనకబడ్డారా?''

ఇంకా షాకులోంచి తేరుకోలేదు లక్ష్మీపతి. బుర్రొంచుకొని బొట బొట కన్నీళ్ళు కారుస్తున్నాడు. అడిగిన కొడుక్కి సమాధానం చెప్పలేకపోతున్నాడు. అతని వాలకం చూసి ఎవరూ ఏం అడగలేకపోతున్నారు. ఇల్లంతా నిశ్శబ్దం ఆవహించింది. భార్య, పిల్లలూ బిక్కచచ్చిపోయారు. ఎట్టకేలకు లక్ష్మీపతి కళ్ళు తుడుచుకుని..

“లక్ష్మీ ఇది చాలా ఆశ్చర్యంగా వుందిస్మీ. నిన్న రాత్రి ఎవడో వచ్చి నన్ను బెదిరించి తాళాలు లాక్కుని బీరువా తెరచి లాకర్ బద్దలు కొట్టి, నూరు వేయి రూపాయల కట్టను అందుకుని బయటకు పరిగెత్తాడు. వాడి వెనుక నేను పరిగెత్తాను. కానీ దొరక్కుండా పారిపోయాడు సందుల్లోకి. అప్పటికే నాలుగు గంటలు అయింది వెతికి వెతికి, చటుక్కున తలుపు తీసివచ్చేశానని ఆశ వదిలి, పరిగెత్తుకొచ్చి బీరువా తెరచి చూస్తే డబ్బు మాయం!!

“అదేంటి నాన్నగారూ, ఇంత హడావిడి అయినా మాకెవ్వరికీ తెలిసిరాలేదూ?''

“అదేరా పోయేకాలం వస్తే లక్ష్మీదేవి నడుచుకుంటూ వెళ్లిపోతుందట''

“ఏవిటో నాన్నా, నమ్మలేకపోతున్నాను. ఒంటిగంట రాత్రివరకు గదిలో చదువుకుంటూనే వున్నాను. మళ్ళీ మీరు అలసిపోతూ వచ్చేవరకూ నిద్రేపట్టలేదు. ఏ చప్పుడూ వినిపించలేదే. కనీసం బీరువా తీసి లాకర్ పగలుగొట్టినప్పుడైనా శబ్దం వస్తుంది. అదీ లేదు. చూస్తుంటే ఏదో మిరాకిల్‌లానే వుంది'' అన్నాడు కొడుకు చంటి.

“బహుశా నువ్వు నిద్రాపుకోలేక పడుకొని వుంటావు''

“అంతే అయివుంటుంది నాన్నా, అదీ కాకుండా ఈ మధ్య దొంగలు మత్తుమందో, క్లోరోఫామో జల్లేస్తూ తెలివి రాకుండా చేస్తూ దోచేసుకుంటున్నారు'' నీలిమ చెప్తున్నాది.

## ప్రక్షాళన

గడియారాన్ని మార్చాలి
గది గోడల్ని కాకపోయినా
కర్టెన్సు మార్చాలి
ఇంట్లోని దీపాల్ని మార్చాలి
అప్పుడప్పుడు - మనం చదివే
దినపత్రికల్ని మార్చాలి
నడిచే దారి మార్చాలి
మొహమాటాల్ని మార్చాలి
మార్చాల్సినవన్నీ
మార్చనివన్నీ
మార్చలేనివన్నీ
మార్చాలి.
మార్చాల్సినవేవీ
లేదంటే
మార్పు అవసరం
రాలేదంటే
బహుశా
నీవద్ద వుంటున్నది
వుండాల్సినవి ఏమీ లేదని
అర్థం.
ఎక్కడైనా మార్పు ఒక
ప్రక్షాళన
ఒక దిక్సూచి

**పలమనేరు బాలాజీ**

''అదీ నిజమే తల్లీ. ఆఁ... జ్ఞాపకం వచ్చింది. ఈమధ్యనే మా ఆఫీసులో నా కొలీగ్ ఇంట్లో ఇదే జరిగి భారీగా దొంగలు దోచుకున్నారు. వాళ్ళు కంటికీ మంటికీ ఏడుస్తూనే వుండేవారు. ఇప్పటికీ నా చెవుల్లో వినిపిస్తుంది వాళ్ళ ఏడుపు''

''వాళ్ళు అప్పుడు ఏడ్చారు, మనం ఇప్పుడేడుస్తున్నాం'' అంది నీలిమ.

''చాలా ఆశ్చర్యంగా వుందండి'' భార్య లక్ష్మి మగణ్ణి పట్టుకుని భోరున ఏడుస్తుంది.

''అవునే నాకూ అలాగే వుంది. నా కళ్ళముందునుంచే జారిపోయాడు'' లక్ష్మీపతి పెళ్ళాం భుజాలు రాస్తూ అన్నాడు.

''కేకలు వెయ్యలేకపోయారా?''

''గొంతు పెగల్లేదే. వాడి దగ్గర పిస్తోళ్ళు, కత్తులూ వుండవని ఎలా అనుకోడం? అరిస్తే గుండెల్లో గుచ్చేస్తే?''

దాంతో ఎవరూ మాట్లాడలేదు. ఇంత అన్యాయమా, ఇంటిల్లిపాది వున్నాం. అయినా కళ్ళల్లో కారం కొట్టాడు. ప్రారబ్ధం. ఏం చేస్తాం. బంగారం కూడా ఆ బీరువాలోనే వుంది. గజగజలాడిపోతూ అంది లక్ష్మి ''ఏవండీ చూడండి''.

చూసిన లక్ష్మీపతి చల్లబడి, ''వున్నాయే, అన్నీ వున్నాయి'' అన్నాడు. మంచి దొంగలానే వున్నాడు. క్యాష్ మాత్రమే పట్టుకునిపోయాడు'' చిన్నగా నవ్వుతూ తిరిగి అన్నాడు లక్ష్మీపతి.

''అదేంటండి నవ్వుతున్నారు. వెంటనే పోలీస్ రిపోర్టివ్వండి''

''అవును నాన్నగారూ వెళ్ళండి'' అంది నీలిమ.

''మీరెవరూ ఇవ్వక్కరలేదు. నేనిప్పుడే ఇచ్చొచ్చాను'' అప్పుడే ఇంట్లోకొచ్చిన చంటి చెప్పాడు.

''ఏరా చంటీ వాళ్ళు వస్తున్నారా?'' తల్లడిగింది.

''అబ్బబ్బా, వస్తారులెద్దూ'' సాగదీసాడు లక్ష్మీపతి.

''అదేంటి నాన్నా అలా నెమ్మదిగా అంటావు. పోయింది రూపాయా, రెండా, లక్షా!''

''అవున్రా చంటీ. లక్షే అయితే ఏం అంటావు. పోయింది. మంచివాడు కాబట్టే బంగారం వుంచాడు'' అన్నాడు విసుగ్గా లక్ష్మీపతి.

చంటి అదోలా చూశాడు తండ్రి వంక.

❖ ❖ ❖

''ఏం లక్ష్మీపతీ మీ ఇంట్లో దొంగలు పడ్డారుట. లక్ష క్యాష్ గోవిందాట. మీ చంటి చెప్పాడులే''

జోకర్ రాకా, లైఫ్ లేక ఏడుస్తున్న లక్ష్మీపతికీ మాటలు అంతలా వినిపించలేదు. మరోసారి పక్క పార్టనర్ అడిగేసరికి కోపం వచ్చింది. చర్రున లేచాడు.

''అవునయ్యా, ఎందుకలా పేకేసి రిపీట్ చేస్తావు. పోయింది, నువ్వేమైనా ఇస్తావా? నీ ఆట చూసుకో. అసలే లైఫ్ లేక చస్తున్నాను'' కేకలు వేశాడు. అగ్గిమీద నెయ్యిపోసినట్లు మండిపోయాడు లక్ష్మీపతి.

'అలాగా... అంతేకావాలి నీకు. అయినా రోజూ

పేకాటలో వందలూ, వేలు తగలెడతాడు. ఆ లక్షా ఇందులోనే పోసుంటాడు. దొంగమీద పెట్టేశాడు పేకాట దొంగ' అనుకున్నాడు కసిగా పార్టనర్.

లక్ష్మీపతికి పేకాటంటే ప్రాణం. ఎంతపోతుంటే అంత కసి ఇంకా ఆడదాం అని. పిత్రార్జితం వుంది కాబట్టే సరిపోయింది. అదే లేకపోతే ఈపాటికి రోడ్డే. కొడుకు చంటికి చిన్న అనుమానమే.

ఆర్‌టిఓ ఆఫీసులో లైసెన్సిచ్చే టేబిల్ లక్ష్మీపతిది. ఇంకేం, అమ్యామ్యాలకు కొదవుండదు. వద్దన్నా జేబులో కుక్కుతారు ఓనర్స్. వందా, రెండు వందలు రోజూ వుంటాయి. అయితే ఏం లాభం, పేకాట భూతం మింగేస్తుంది. లక్ష్మీపతికిది పెద్ద దెబ్బగా అనిపించదు. స్వంతం అయితేకదా మరి. నెలజీతం పాతికవేలు, పైరాబడి లెక్కపెట్టలేం. ఏనాడూ ఏకాట్లో గెలవడు. లక్ష్మీపతి రాకపోతే తక్కినవాళ్ళకు తోచదు. లక్ష్మీపతి దగ్గర లాగి అదే మదుపుగా పెట్టి ఆడతారు. అమాయకుడు పతి.

లక్ష్మీపతి తెలివైన అమాయకుడు. ఆఫీసులో బాసుకి ఏనాడూ ఎదురు చెప్పడు. ఇప్పటికో పదిమంది ఆఫీసర్లను చూశాడు. అందరి దగ్గర మంచిగానే మసులుతాడు. ఇద్దరాడ పిల్లలు. మంచి స్కూల్స్‌లోనే చదివిస్తున్నాడు. కొడుకు ఇంజనీరింగ్ సెకండియర్‌లో వున్నాడు. అన్నీ బాగున్నాయి. కానీ ఈ జూద వ్యసనమే ఆయన్ని దెయ్యంలా పట్టి వదల్లేదు. అందుకే కొన్ని వెధవ పనులు చేయాల్సి వస్తుంది. దీనికి తోడిప్పుడు లక్ష పోయింది అదీ క్యాష్!

❖ ❖ ❖

''దొంగా... దొంగా... పట్టుకోండి. అయ్యో... క్యాష్... గోల్డ్... పట్టుకోండి...'' నిద్రలోనే అరుస్తున్నాడు లక్ష్మీపతి.

''ఏంటి నాన్నా అలా అరుస్తున్నావు. దొంగ కల వచ్చిందా'' అంటూ లేపాడు తండ్రిని చంటి.

దాంతో తుళ్ళిపడి ''దొంగా... దొంగా...'' అంటూ గాభరాగా లేచాడు లక్ష్మీపతి.

''నాన్నా... దొంగా, నాన్నా దొంగా...''

''ఉష్!... నొర్మ్యాయ్యి...''

''దొంగే లేదు. దొంగున్నట్లే దొంగా... దొంగా... అని అరుస్తున్నావు''

ఏం చెప్పడానికి పాలుపోక, దుప్పటి తన్నీ మళ్ళీ పడుకున్నాడు లక్ష్మీపతి.

డబ్బు పోయినదగ్గరనుండీ అదే మనస్సులో పెట్టకుని నిద్దర్లో అరుస్తున్నారు నాన్న. పూర్ నాన్న! అనుకుని వెళ్ళి పడుకున్నాడు చంటి.

తెల్లారింది. గుమ్మంలో ముగ్గులుపెట్టి వస్తున్న లక్ష్మి భర్త నిద్రలోనే ఏదో గొణుగుతుండడం వింది. దగ్గర కొచ్చింది.

''జోకరొచ్చింది... అమ్మా... నీకేం కాదు... నాకు... షో... నాది షో... నాది డీల్... తీయండి. ఆర్ కౌంటు గాళ్ళు న్యాయంగా చెప్పండి... తియ్యండి డబ్బు...''

ఆ మాటలేమిటో తెలియని లక్ష్మి తట్టి లేపింది భర్తని. తుళ్ళిపడి లేచాడు లక్ష్మీపతి.

''ఏవిటండీ నిద్దర్లో అలా అరుస్తున్నారు. జోకరేంటి, షో ఏంటి, డబ్బులేంటి?''

నిద్రలో కూడా పేకాట భాష వదలదనుకుని, ''అదా, అబ్బే... ఏం లేదు లక్ష్మీ. డబ్బుపోయింది కదా, అదే మనసులో వుండిపోయింది. రూపాయా, రెండా లక్ష!''

అయ్యో పాపం అనుకుని... ''నిజమే, పోయింది. ఏం చేస్తాం. ప్రారబ్దం అనుభవించాలి. అయితే, అదే పట్టుకుని నిద్రలో కూడా కలవరించాలా. పదండి శ్రీ వెంకటేశ్వరస్వామి మందిరానికి. అర్చన చేయిద్దాం. అదే తగ్గిపోతుంది, దుస్వప్నాలు రావు''

''అలాగే లేవే...'' లేచి వెళ్ళి రెడీ అయ్యాడు మందిరానికి. 'నామాటలు నమ్మేసింది. అమాయకురాలు' అనుకున్నాడు మనసులో.

ఇంటికొచ్చేశారు లక్ష్మీ-పతీను. తెచ్చిన ప్రసాదాన్ని పిల్లలకు పంచారు. టైం ఉదయం ఏడున్నర. చంటి రాత్రల్లా చదవడం మూలాన ఇంకా లేవలేదు. సీతారాం... అనుకుంటూ మరో అరటిపండు ప్రసాదంగా నోట్లో వేసుకుని గదిలోకి వెళ్ళి తలుపేశాడు లక్ష్మీపతి.

న్యూస్‌పేపర్‌తో తలుపు తట్టింది నీలిమ. ఐదు నిముషాల తరువాత తలుపు తెరిచాడు లక్ష్మీపతి.

''ఇదిగో నాన్నా పేపర్‌ని అందిస్తూ మంచంమీద పరిచిన పేకముక్కలు చూసింది. ఆ పక్కనే ఓ కాగితం వుంది. ఏదో అంకెలు దానిమీదున్నాయి. నిశితంగా చూసింది. అన్నీ డబ్బుల అంకెలే! మెల్లిగా లాగి అమ్మకు చూపించిందా కాగితం.

లక్ష్మికి ఆ అంకెలు ఏమిటో బోధపడలేదు. అప్పుడే లేచి కాఫీ తాగుతున్న చంటి ఆ కాగితాన్ని లాక్కొని చూశాడు. అర్థం అయింది కాస్త. ఒక దగ్గర క్యాపిటల్‌లా పది వేలుంది. మరో దగ్గర ఐదు వేల చిల్లరుంది. ఇంకో దగ్గర మూడువేల డెబ్భైరూపాయిలు కనబడుతున్నాయి. ఇంకోదగ్గర మైనస్‌లున్నాయి.

ఈజ్ యీక్వల్టూ గుర్తుంది. అక్కడ కొంతమొత్తం

వుంది. ఆఖరికి మైనస్‌లో ఫిగర్స్ కనిపించాయి. చంటికి పూర్తిగా బోధపడింది. తీసుకెళ్ళింది పదివేలనీ, మిగిలింది మూడు వేల చిల్లరని. ఇది పేకాట లెక్కే తప్పకుండా అనుకుని తండ్రి దగ్గరకు వెళ్ళాడు. లక్ష్మీపతి పేపర్ చూస్తున్నాడు.

''నాన్నగారూ...''అన్న కొడుకు వంక పేపర్ చూస్తున్న లక్ష్మీపతి ఏమిటన్నట్టు చూశాడు. కొడుకు మొహం నవ్వుతున్నట్టుంది. సంగతినూహించలేదు. లక్ష్మీపతి నవ్వుతూ...

''ఏరా చంటీ...?''

''పదివేలు నాన్నా...'' అంటూ నవ్వుతున్నాడు చంటి.

కొడుక్కి తన భాగోతం తెలిసినట్టుంది. ఏం మాట్లాడ లేదు.

''గాంబ్లింగ్ ఈజ్ హారంఫుల్ నాన్నగారు'' అనేసి పారిపోయాడు.

ఆ మాటతో లక్ష్మీపతికి చెంప చెళ్ళుమన్నట్టై చంప తడుముకున్నాడు. ఆశానిపాతంలా వీడెక్కడ పుట్టాడ్రా బాబు అనుకున్నాడు.

''ఏమిట్రా చంటీ పదివేలంటున్నావు, గాంబ్లింగ్ అంటున్నావు?''

''అబ్బే ఏం లేదునాన్నా. జనరల్‌గా గాంబ్లింగ్ ఈజ్ హారంఫుల్ అన్నాను. పదివేల సంగతి ఆ పేపర్లో వుంటే అన్నాను'' చంటి నవ్వుతూనే అన్నాడు.

ఆ మాటకి ఏం అనక భార్యదగ్గరకెళ్ళిపోయాడు.

❖ ❖ ❖

చంటి చదువుకుని పడుకున్నాడు. రాత్రి ఒంటి గంట. చంటికి నిద్రపట్టలేదు. లేచి చదువుకుందామా అనుకుని బద్ధకించాడు. అలా రెండైంది రాత్రి. ఇంతలో లక్ష్మీపతి గది తలుపు తీసి బయటకొచ్చాడు. చప్పుడికి చంటికి తెలివచ్చింది. అప్పుడే కళ్ళుమూతలు పడుతుంటే ఈ చప్పుడుకి లేచి చూస్తే తండ్రి. అలా చూస్తున్నాడు.

లక్ష్మీపతి మెల్లిగా బీరువా తెరచి లాకర్ తీసి ఏదో తీసి మొల్లో పెట్టుకుని బీరువా వేసి. చీకట్లో పెరటితలుపు తీయడానికి అడుగులు వేస్తూ వుంటే మంచం తగిలింది.

చిన్న చప్పుడై పడుకున్న నీలిమ లేచి చూసింది. చీకటిలో ఏదో ఆకారాన్ని చూసి భయపడి దొంగా... దొంగా... అని అరిచింది. దాంతో చంటి బయటకొచ్చి వీధిలోకి పరిగెత్తాడు. ఎందుకంటే పెరట్లోంచి వస్తే వీధికే రావాలని.

అందరూ లేచిపోయారు. లైట్లన్నీ వెలిగాయి. దొంగా... దొంగా... అని కేకలేస్తున్నారు. చంటి వీధిలో కాచాడు. అంతలో వీధిలోకున్న పెరటిదోవలోంచి నల్లని ముసుగు బయటకొచ్చింది. వెంటనే చంటి చటుక్కున పట్టుకున్నాడు దొంగా...దొంగా అంటూ.

అందరూ బయటకొచ్చారు. నాలుగు గంటలైంది తెల్లవారుఝామున. వెంటనే చంటి తలమీద నల్లగుడ్డ లాగేశాడు. వ్యక్తి బుర్రొంచుకుని నిలబడిపోయాడు.

''అన్నయ్యా, నాన్నగారు...'' అంది నీలిమ.

''ఆఁ! నాన్నగారా'' అంటూ బుర్రెత్తారు. ఇంకేం వుంది లక్ష్మీపతి! అందరూ ఆశ్చర్యపోయారు.

''ఇదేవిటి నాన్నా మీరా!'' అన్నాడు చంటి.

''నాన్న... దొంగ... దొంగ... నాన్న...'' అంటూ నవ్వుకుంది నీలిమ.

''ఇదేం పోయేకాలం. మనింట్లోనే దొంగతనమా? మీ ఇంట్లో మీరే దొంగతనం చేస్తున్నారా?'' అంది లక్ష్మి. మొల లాగి చూశాడు చంటి. ఆశ్చర్యం, ఓ పెద్ద కట్ట రూపాయిలు!

''అమ్మా, ఇంకెవరూ దొంగలేడు. నాన్నగారే దొంగ. లాస్టైం పోయిన లక్షా ఈయనే తీసి పేకాట భూతానికి భోజనం పెట్టారు''

''అందుకే అంటారు ఇంటి దొంగని ఈశ్వరుడు కూడా పట్టలేడని'' అంది లక్ష్మి.

''కానీ ఈ ఇంటి దొంగని చంటన్నయ్య పట్టేశాడు'' అంది నీలిమ.

అందరూ నవ్వారు. లక్ష్మీపతి జూదశ్రీలా మొహంపెట్టి చూస్తున్నాడు. ■

## ఆదర్శంగా!

సమాధి మాట్లాడదు

సందేశాన్నిస్తుంది

గీత చరితను తెలుసుకొని

బ్రతుకును దిద్దుకొమ్మని

రాబోయే తరానికి

నీ చరితను ఆదర్శంగా ఇమ్మని!

దోసపాటి సత్యనారాయణమూర్తి